

# సంక్రాంతికి సంక్రాంతికి

యస్. వి. రంగారావు

సంక్రాంతికి యింటికి రమ్మని మా అమ్మగారి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. వంటరి జీవితం. హాస్టల్ భోజనం, నోటికి, బుద్ధికి ఏదీ రుచించని నిండు యవ్వనపు రోజులవి — ఏదైనా, రుచికరంగా కనిపించే రోజులుకూడా అవే. ఆ రోజుల్లో మాతృసందర్శనం కంటే మధురమైనది ప్రపంచంలో వుంటుందని కూడా ఎరగను నేను. ఆ వుబలాటంతోనే వాల్తేరు స్టేషనులో రైలెక్కాను.

ఈ వెధవ స్టేషనులో గంటలతరబడి ఆగిపోతుంది ఏ రైలైనా. మరి, ఆ రైళ్ళకీ ఈ స్టేషనుకూ ఏదైనా అవినాభావ సంబంధం వుందేమో తెలియదు గాని, ఎంత సేపటికీ బండి కదలక పోవటంచేత విసుగుపుట్టి, ప్లాట్ఫారమ్ మీద దిగి, సిగరెట్ కాల్చుకుంటున్నాను. ఆ సమయంలోనే కాళీగా వుందని కాబోలు ఒక వయసుమళ్ళిన పల్లెటూరి పెద్దమనిషి టోలెడంత సామానుతో నా పెట్టెలోకే ఎక్కాడు. ఒక్క మనిషికి యింత సామా నెందుకా అనిపించింది.

ఆయన నడకలోగాని, ప్రవర్తనలో గాని ఏవిధమైన తొట్రుబాటుగాని, తొందరగాని కనిపించలేదు. సాధారణంగా మనం చూస్తూనే వుంటాం — పల్లెటూరి అమాయకపు ప్రజలు యింకా ఎంతో టైముందని తెలిసినా, రైలెక్కేటప్పుడు మాత్రం చాలా కంగారుగాను, హడావుడిగాను కనిపిస్తారు. కాని ఈ పెద్దమనిషి టైమునిగురించిగాని, రైలును గురించిగాని ఈషణ్మాత్రమైనా లెక్కచేసినట్టు కనిపించలేదు. పైగా. నువు గాకపోతే నీ బాబు యింకో రైలన్నట్టుగా కనిపించా డాయన.

ఆయన మనస్తత్వాన్ని పట్టి చూడటానికి మొదలుపెట్టాను. ప్లాటుఫారమ్ మీదే నిలబడి, సామానంతా సర్దుకున్నాక అతి తీరుబడిగా కూర్చున్నా డాయన. ఆ కుతూహలంలో నాకు గార్డు విగిల్ కొట్టిన సంగతికూడా తెలియలేదు. రైలు కదులుతుంటే గబుక్కని ఎక్కాను.

ఎక్కి, పాయిఖానాలోకి వెళ్ళివచ్చి

కూర్చున్నాను. పాపం, నేను రైలు కదులుతుండగా ఎక్కడంచూచి ఏమను కున్నాడో ఏమో, ఆ పెద్దమనిషి నన్ను చూచి ఒక చిరునవ్వు నవ్వి, ముఖం అవతలికి తిప్పుకున్నాడు. నా కర్థం కాలేదు. అనకాపల్లి స్టేషను వచ్చేదాకా బండిలో మే మిద్దరమే వున్నా, ఒకరితో ఒకరు మాట్లాడనేలేదు. స్టేషనులో బండి ఆగగానే లేచి కక్కసుకు వెళ్లాను.

నేను లోపల వున్నప్పుడు ఒక టిక్కెట్ – కలెక్టరు బండిలోకి ఎక్కాడట. ఆయనకు తన టిక్కెట్ చూపించి, పైగా - తన మిత్రుడుకూడా తనతో వస్తున్నాడనీ, ఆఖరు క్షణంలో స్టేషనుకు రావడంచేత ఆయనకు టిక్కెట్ కొనలేదనీ, కక్కసులో వున్నాడనీ ఆయనకు కూడా ఒకటిక్కెట్టు యిమ్మనీ. పేరు రామారావుగారనీ చెప్పి, అదనంకూడా చెల్లించి, సామర్ల కోటవరకూ టిక్కెట్టు పుచ్చుకున్నాడట.

రైలు కదిలిన చాలా సేపటి వరకు నేను సీటులోకిరాలేదు. వచ్చి చూసే టప్పటికి ఆ పెద్దమనిషి నాకేసి చూసి, మందలింపుతో కూడుకున్న చిరునవ్వు నవ్వుతూ, "నాయనా! ఇంక ఫరవాలేదులే. స్టేషన్ స్టేషన్‌కీ నువ్వు కక్కసుకి వెళ్ళక్కరలేదు. నీ కోసం కూడా సామర్లకోట వరకూ టిక్కెట్టు పుచ్చుకున్నానులే. ఏ వూరు వెళ్తావేమిటి?" అన్నా డాయన.

"నరసాపురం వెళుతున్నా" నని చెప్పానుగాని,ఆయన మాట్లాడిందేమిటో నా కర్థం కాలేదు. "అయ్యా, మీ రెవరో ఏమిటో నాకు తెలియదు. మీరు చెప్పిం దేమిటో నా కర్థం కాలేదు" అన్నాను.

"లేదులే నాయనా. నువ్వు సామర్ల కోట వరకు యిక్కడే కూర్చో. నేనా స్టేషన్‌లో దిగి కాకినాడ వెళ్తాను. నువ్వు ఎక్కడికి వెళతావో తెలియదు. అందు చేత సామర్లకోట వరకే తీసుకున్నాను. ఆ స్టేషన్‌లో దిగడంతోటే నీకు నరసా పురం వరకు టికెట్ కొనియిచ్చి మరీ వెళతానులే. మరేం ఫరవాలేదు." అన్నా డాయన.

ఆయన అమాయికత్వానికీ, ఉదార స్వభావానికీ ఆనందించాలో, లేక నా కాయన చేసిన అవమానానికి ఆగ్రహించాలో తెలియలేదు.—అంటే ఈ పెద్ద మనిషి నేనొక టికెట్టు లేని బికారీని అనుకున్నాడన్నమాట. నేను ఆఖరు నిమిషంలో రైలెక్కడం, ఎక్కిన వెంటనే పాయిఖానాలోకి వెళ్లడం,అనకా పల్లి స్టేషన్‌లో మళ్ళీ కక్కసుకి వెళ్లడం చూసి, అదే సమయంలో టికెట్-కలెక్టరు రావడం.—ఓరి భగవంతుడా, ఏమిటీ చిత్రమైన సంఘటనలు! నా కడుపులో గందరగోళం ఆయనకేం తెలుసు?—ఇవన్నీ ఆయన అనుమానాన్ని రూఢిచేశాయి.


ఇక ఆయనమీద నా కంఠశోష వృథా. ఆగ్రహానికి అంతులేదు. నాలో వున్న జంతువు పట్టుకు తన్నమంది. నాలో వున్న మనిషి గట్టిగా బుద్ధిచెప్ప మన్నాడు. నాలో వున్న జ్ఞాని ఓపిక పట్టమన్నాడు. — మాట్లాడలేదు. జేబు లోంచి మొదటితరగతి టిక్కెట్టుతీసి చూపించాను. పాపం. మనిషి బిత్తర పోయాడు! కన్నీళ్ల తరువాయిగా క్షమా పణలు చెప్పడం మొదలుపెట్టాడు. నాకు జాలివేసింది. ఇంత పెద్దమనిషి చేత క్షమాపణ చెప్పించుకోవడ మేమి టనిపించింది. నాలోని జ్ఞాని 'చూశావా, ఎంత పొరబడ్డావో' అని హెచ్చరిక చేశాడు.

"ఫరవాలేదులెండి. కాని, అనవస రంగా డబ్బు ఖర్చు చేశారే, అదే విచా రంగా వుం"దన్నాను.

మౌనం —

ఏమిటిది ?— ఈయ నెవరు? నే నెవరు? నా పేరుకూడా తెలియదే! నిజంగానే నాకు టిక్కెట్ లేకపోయినా, ఈయ నెందుకు కొనాలి? అర్థంకాలేదు, నా చదువుకున్న బుర్రకి.

అడిగేశాను: "అయ్యా!— నేనెవరో తెలియకపోయినా — నాకు నిజంగానే టికెట్ లేదనుకోండి - అయితేమాత్రం, మీ రెందుకు అల్లా కొన్నారు? రైల్లో వున్న టికెట్ లేని ప్రతి అనామకుడికీ



మీరు టికెట్ కొనిస్తుండడం, మీకు సరదా పనా?" అని.

"లేదు బాబూ, నిన్ను చూస్తే మా అబ్బాయి జ్ఞాపకం వచ్చాడు. అందుచేత, అలా నీకు నిజంగా టికెట్ లేదేమో ననుకొని జాలి పుట్టి, అలాంటి తెలివి తక్కువ పని చేశాను. క్షమించు" అన్నాడాయన.

ఒకవిధమైన జీర వినిపించింది ఆ గొంతుకలో. ఎక్కడివో నిదాఘమైన విషాద ఛాయలు గోచరిస్తున్నాయి, ఆయన భాషలో. అగ్నిపర్వతాన్ని మింగిన వ్యక్తిలాగా కనిపించాడు నా కాయన. ఏదో భరించలేని బాధ అని పించింది. కళాపూరితమైన నా మెదడుకి అంతుచిక్కలేదు.

"అయ్యా, క్షమించండి. మీరు తప్పుగా భావించకపోతే, మీ అబ్బాయి ఎవరో — ఎక్కడ వున్నాడో — ఆయ నకూ నాకూ ఏ విధమైన పోలిక మీకు కనిపించిదో, కాస్త సెలవిస్తిరంటే

సంతోషిస్తాను" అన్నాను, అమాయికంగా.

కళ్ళంట నీళ్లు తిరిగాయి ఆయనకు.

"పోయాడు బాబూ, మొన్ననే. ఆస్పత్రిలోనే పోయాడు. మా వాడ్ని ఈ విశాఖపట్టణానికే వప్పగించి వెళ్ళిపోతున్నాను," అన్నాడు. కండువాతో కళ్లు తుడుచుకున్నా డాయన.

"క్షమించండి. విషయం గ్రహించలేక మీ మనసు కష్టపెట్టాను" అన్నాను—మౌనం —

నాలోని కుతూహలం వూరుకోలేదు. 'పాపం, జబ్బేమిటండీ?' అన్నాను. "నాయనా! — అదొక పెద్దకథ. నిన్ను కూడా బాధపెట్టడం దేనికి?" అన్నాడు.

'ఫరవాలేదులెండి. నన్నుమీ బిడ్డగా యెంచుకునే చెప్పండి.' అని ప్రాధేయపూర్వకంగా అడిగాను.

"మాది కాకినాడ దగ్గర రేలంగి. డబ్బు యింకా రెండు మూడు తరాల వరకు, వుద్యోగాలు లేకుండానే తినొచ్చు. కాని, నాకు వక్కడే పిల్లవాడు. పురిటి గదిలోనే తల్లి మరణించింది. పాలు కూడా పీకీ పట్టేవాణ్ని. ఆస్తి పరుణ్ణవడంచేత, ఒక్కడే కొడుకవడంచేత, చాలా గారాబం చేసిన మాట వాస్తవమె. కాని, అతను చేసే అల్లరిలో మాత్రం మంచి తెలివితేటలు కనిపించేవి నాకు. అందుచేత ఎక్కువ మందలించే వాడ్ని కాను. పేరు రామారావు. నీ పేరేమిటి బాబూ?"—

"నా పేరు — రంగారావండి."

"అలాగా? — ఏదో, మతిభ్రమచేత యిందాక టికెట్ — కలెక్టర్ వస్తే రామారావు పేరుమీదే టికెట్ కొన్నాను" అన్నాడు.

"హైస్కూలు చదువుకని కాకినాడ తీసుకొచ్చాను, వ్యవసాయం రైతుల కప్పజెప్పి. దగ్గిరే అవటం చేత నేను కూడా కాకినాడలోనే మకాం పెట్టాను. దిట్టంగా చదువుకొనే వాడు. ఏ ఒక్కరిద్దరో తప్ప ఎక్కువమంది స్నేహితులు కూడా ఉండేవారు కారు. రోజూ సాయంత్రం ఫుట్‌బాల్ మాత్రం ఆడుకొనే వాడు.

"ఒకరోజు యింటికి జ్వరంతో వచ్చాడు. డాక్టరుకు చూపించాను. మలేరియా అని మందిచ్చాడు. రెండు రోజులకే జ్వరం తగ్గింది. కాని అప్పుడప్పుడు వస్తుండేది. ఆస్పత్రిలో పరీక్షచేసి, అదేదో కేన్సర్ అన్నారు. విశాఖపట్టణం తీసుకెళ్లమన్నారు. తీసుకొచ్చాను బాబూ, తొడలో కేన్సర్ అని ఏవేవో యింజక్షన్లిచ్చారు. ఆస్పత్రిలోనే పదిహేను రోజు లుంచారు. పెద్ద డాక్టర్లంతా వచ్చి చూసేవారు. కాని, నాకుమాత్రం ఏమీ చెప్పేవారుకాదు. అబ్బాయిని మాత్రం నవ్వుతూ పలకరించేవారు.

"ఒకనాడు ఆ వార్డు డాక్టరుగారు నా దగ్గరకు వచ్చి 'మీతో ఒక విషయం మాటాడాలి' అని అయన గదిలోకి తీసుకువెళ్ళారు. కాఫీ తెప్పించి యిచ్చారు. 'మీరు తమాయించుకోవాలి. కంగారు పడకుండావుంటే ఒక విషయం చెప్తా' నన్నారు. నా బిడ్డ యేమైపోతాడో నని కంగారు పట్టుకుంది. త్వరగా చెప్ప మని వేడుకున్నాను.

" 'ఏమీ లేదులెండి. కేన్సర్ ముదిరింది. అది మిగతా శరీరానికి వ్యాపించకముందే. కాలుతీసేయాల్సివుంటుంది. ఈ సంగతి అబ్బాయితో ముందుగా చెప్పడమే మంచిది. లేకపోతే. ఆపరేషన్ అయిన తరువాత స్మారకానికి వచ్చినప్పుడు ఎక్కువ కంగారుపడతాడు,' అని చెప్పాడు.

"బాబూ ! – ఏమి చెయ్యాలో తోచ లేదు. నా ఈ ఒంటరి జీవితానికి ఆనందం కలిగించటానికి కలిగిన ఒక్కగా నొక్క బిడ్డడు కుంటివాడా ! భగవంతుడా !– ఇంకా నామీద జాలి కలగలేదన్న మాట ?– పైగా, ఈ విషయం అబ్బాయితో ఎలా చెప్పటం – చీకట్లు కమ్ముకున్నాయి. బోరుమని యేడ్చాను. పాపం, నామీద జాలిపడి, అక్కడి స్టాఫ్-నర్సు, "మీరేమీ కంగారుపడకండి. నేనూ, మా డాక్టరుగారూ ముందువెళ్ళి చెప్తాము. తరువాత మీరు వద్దురుగాని లెండి"



"ఏమను కున్నారు మా ఆవిడ స్వయంగా కుట్టింది తెలుసా ?"

అన్నది. నిశ్చేష్టుడనై నిలబడిపోయాను.

"అయిదు నిమిషాల తరువాత నర్సు వచ్చి నన్ను లోపలికి రమ్మంది. ఎలా నా బిడ్డను చూడడమో నా కర్థం కాలేదు. కాలు తీసేస్తారన్న సంగతి చెప్పే వుంటారు. ఏమంటాడో ! ఏమని యేడుస్తాడో !–కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి. గుండె గొంతులోకి వచ్చినట్లయింది. కళ్ళు తుడుచుకుని లోపలకు వెళ్ళాను. నా బాబు చిరునవ్వు నవ్వుతున్నాడు. 'నువ్వు లోపలకు రాలేదేం నాన్నా ? బయటే వున్నావే ?' మన్నాడు.

"నాకు నర్సుమీదా, డాక్టరుమీదా అనుమానం వేసింది. ఒకవేళ వాళ్ళు

అసలుసంగతి చెప్పనే లేదేమో నను కొని. నాచేత చెప్పించడానికి ప్రయత్ని స్తున్నా రనుకున్నాను. అనుకొన్నట్టు గానే నేను రావడంతోటే వాళ్ళిద్దరూ గదిలోంచి వెళ్ళిపోయారు. బాబు దగ్గ రకు వెళ్ళి మంచంమీదే కూర్చున్నాను.

'నాన్నా! — నే నింక ఫుట్‌బాల్ ఆడుకోడానికి వీలుండదు కదూ?' అన్నాడు.

"నాకు మతిపోయిందో వుందో నాకే తెలియదు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని, దుఃఖాన్ని దిగమింగుతూ వూరుకొన్నాను. నా బాధ గ్రహించాడు నా బిడ్డ.

'ఫరవాలేదులే. నాన్నా! — కర్రకాలు చేస్తారట. దాంతో మామూలుగానే నడవ వచ్చుట. పంట్లాం వేసుకుంటే ఏమీ కనపడదులే.'

"అంత బాధ పడగలశక్తి నాకులేక బయటకు వచ్చేశాను. భోరుమని యేడ్చాను. మూడు నెల్లయింది బాబు, చదువు మానిపించాను. నేను బాధపడతా ననుకునేవాడో, ఏమో, అలా కర్ర కాలుతోనే మా బాబు కులాసాగా వున్నట్లు కనిపించేవాడు నాకు.

"ఒకరోజు మళ్ళీ జ్వరం వచ్చింది. విపరీతంగా దగ్గడం మొదలుపెట్టాడు. వెంటనే కాకినాడ తీసుకెళ్లాను. వాళ్లు మళ్ళీ విశాఖపట్టణం తీసుకెళ్ళమన్నారు. ఈ సారి భయమేసింది. ఈసారి మళ్లీ ఏ కాలో చెయ్యో తీసేస్తా రనుకుని, — 'వద్దు బాబూ! — మీరే ఏ మందో, మాకో యివ్వం' డన్నాను.

'ఈ జబ్బుకు యిక్కడ వైద్యం లాభం లేదు, విశాఖపట్టణం తీసుకువెళ్ళ మన్నారు. నాకు భయమేసి కొంత కాలం కాకినాడలోనే వుండి, నేటివ్ మందు లేవో యిప్పించాను. కాని, రోజురోజుకి బాబు క్షీణించిపోవడం మొదలు పెట్టాడు. కొందరు పెద్దల ప్రోత్సాహంతోనూ పట్టుదలతోనూ మళ్లీ ఈ విశాఖపట్టణం వచ్చాను. మళ్లీ ఈ డాక్టర్లగుంపు తయారయ్యారు. ఏదో వాళ్లలో వాళ్లు మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. నాకు వక్కటీ చెప్పరు. పల్లెటూరి వాణ్ణిగదా, వాళ్ల భాష నా కర్థ మయ్యేది కాదు. కాని, మొత్తానికి ఏదో విపత్తు వుందని మాత్రం గ్రహించ గలిగాను.

"ప్రతి డాక్టరునీ అడిగేవాడిని. ఫరవా లేదనే వారు. ఏం ఫరవా లేదో ఏమో గాని, మా బాబు రోజురోజుకీ చిక్కి శల్యమవుతూ వచ్చాడు. నా పుణ్యమా అంటూ, పూర్వపు నర్సు మళ్లీ ఆ వార్డుకే వొచ్చింది. పదే పదే అడగ్గా ఒకరోజున చెప్పింది — 'ఇది కేన్సర్, వూపిరి తిత్తుల్లో వచ్చింది, చాలా ముదిరింది' అని.

"అంతే. నా బాబు ఇక బ్రతకడన్న


మాట – నా కళ్ల నీళ్లు యిదివరకే ఎండిపోయాయి. సగం యెండిపోయిన మేను, బాబు కాలు తీసెయ్యడంతో పూర్తిగా ఎండిపోయింది. ఇంక ఈ ఎండుకట్టెకి ఏడ్చే శక్తియెక్కడిది. బాబూ !—

"నా బాబుని ఎలా అయినా బ్రతికించమని అనేక దేవుళ్లకు మొక్కుకున్నాను. ఎన్నో ముడుపులు కట్టుకున్నాను. కాని, ఏ దేవుడికీ నా డబ్బు మీద ఆశ లేకపోయింది.

"నాలుగు రోజుల క్రితం మధ్యాహ్నం చాలా నీరసస్థితిలో వున్నాడు. నా తండ్రి నన్ను దగ్గరగా రమ్మని పిలిచి, 'నాన్నా! – ఇంక నీ కెవరు తోడుంటారు ?' అంటూ, కళ్లంట నీళ్లు పెట్టుకున్నాడు.

"ఆ రోజు రాత్రంతా నిద్రపోలేదు. తెల్లవారు జామున నన్నుపిలిచి. 'నాన్నా!– ఈ దుప్పటంతా నలిగిపోయింది. వేరే దుప్పటి మార్చ మన్నాడు. నేను నర్సును పిలిచి, బాబుని మెల్లిగా సాయంపట్టి దుప్పటి మార్చమన్నాను.

'నాన్నా!- నా కళ్లు తిరుగుతున్నాయి, పట్టుకో' మని, నన్ను గట్టిగా కావలించుకున్నాడు. ఒక్క క్షణంలో ఆ పట్లు వాటంతటవే వదులై పోయాయి. మా బాబు నన్ను ఒంటరిగాణ్ణిచేసి వెళ్ళిపోయాడు. ఈ సామానంతా వాడికోసమే



"మీకు చెక్కుపంపాను, చేరలేదా ?"
"చేరకేం ? రెండుసార్లు చేరింది. ఒకసారి మీ దగ్గరనుంచీ, రెండోసారి బ్యాంకునుంచీ."

---

తెచ్చాను. చివరకు నాకు మిగిలింది ఇదే బాబూ !—"

అంటూ, ఏకధారగా కన్నీళ్ళు కార్చాడాయన.

నాకు గుండె బరువెక్కింది. ఈ ప్రపంచంలో యింత బాధ వుందా అనిపించింది, నొప్పి తెలియని నా హృదయానికి. నేనుకూడా ఏడుస్తున్నా నన్న సంగతి అంతవరకు నాకే తెలియలేదు. యడ్రసు వ్రాసియిచ్చి, ఆయన సామర్లకోట స్టేషనులో దిగిపోయాడు. దూరంగా వెళ్ళింతరువాత నన్నొకసారి వెనక్కి తిరిగిచూశాడు. చేతులెత్తి నమస్కరించాను.

ఆ సంక్రాంతికి నా మనస్సంతా చాలా ఆందోళనగానే వుంది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం సంక్రాంతికి ఆ మహానుభావుడు జ్ఞాపకం వస్తూంటాడు. ఒక్కసారి మనస్సులో ధ్యానించి నమస్కరిస్తూ వుంటాను. ★